
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 16.0
****
ANDHRAJYOTHY


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579 (280.1200)	17,972	17,972
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.80 (4.41)	513.15	513.15
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	2,000	3,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



దేవరకొండ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, జైవీర్‌రెడ్డి



ఎస్‌ఎల్‌బీసీ, డిండి పూర్తి చేస్తాం

- కేసీఆర్, హరీశ్‌రావు బండకట్టుకొని సాగర్, శ్రీశైలంలో దూకినా పనులు ఆపేది లేదు
- దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ/దేవరకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్, హరీశ్‌రావు బండకట్టుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో దూకినా ఎస్‌ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టును తమ హయాంలోనే కట్టితీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శనివారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన ప్రజావిజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలిసి రూ.20కోట్ల వ్యయంతో దేవరకొండ మునిసిపాలిటీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మెప్మా ద్వారా మహిళా సంఘాలకు రూ.11.33కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలూనాయక్ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాల భూమికి సాగునీరిచ్చే ఉద్దేశంతో 2005లో అప్పటి మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్‌ఎల్‌బీసీని రూ.2వేల కోట్లతో చేపట్టారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 30 కిలోమీటర్ల సొరంగం తవ్వారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నల్లగొండపై కక్షగట్టి, సొరంగాన్ని పడావుపడేశారని, 10కిలోమీటర్ల సొరంగాన్ని తవ్వకుండా వదిలేశారని అన్నారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాక తామే ఈ పనులు ప్రారంభించగా, దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి, ఎనిమిది మంది మృతి చెందితే కేసీఆర్, హరీశ్‌రావు డ్యాన్సులు చేశారని ఆరోపించారు. ఎవరు అడ్డుపడ్డా, ఎన్ని కుట్రలు చేసినా ఈ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, వీటితో పాటు...

- మిగతా 7వ పేజీలో...

రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తిచేసి సాగునీరు అందిస్తాం



రెండేళ్లలో శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దేవరకొండ మండలం ముదిగొండ మా అమ్మమ్మ ఊరని, ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించి రుణం తీర్చుకుంటానన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి 14వేల రేషన్‌కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కొడంగల్ మాదిరిగానే దేవరకొండ అభివృద్ధి



దేవరకొండ నియోజకవర్గాన్ని కొడంగల్ నియోజకవర్గం మాదిరిగానే నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. దేవరకొండ నియోజకవర్గంలో సమస్యలు గుట్టలలాగా ఉన్నాయి. గత ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీశైలం సొరంగమార్గాన్ని కుర్చీ వేసుకొని కూర్చొని తొవ్విస్తానని హామీ ఇచ్చి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారు.

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి



దేవరకొండ నియోజకవర్గంలో ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కెటాయించి పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంపై దృష్టిసారించి ప్రధాన సమస్యలను పరిష్కరించాలి. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కెటాయించాలి.

నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే, దేవరకొండ

రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తి



నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్‌లో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పలువురు సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాల్లో 282గ్రామ పంచాయతీలకు, 2,418 వార్డు స్థానాలకు ఈ నెల 14న రెండోవిడత ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఈ నెల 2వ తేదీతో నామినేషన్ల దాఖలు పూర్తయింది. సర్పంచ్ స్థానాలకు 2,116 నామినేషన్లు, వార్డులకు 6,120 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఎంత మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు, ఎన్ని స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది, బరి లో నిలిచిన అభ్యర్థులు, ఏకగ్రీవ పంచాయతీల వివరాలపై ఆదివారం ఉదయానికి స్పష్టత రానుంది. పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు కావడంతో లెక్కలు తేల్చడంలో అధికారులు తలమునకలయ్యారు. రెండో విడత పోలింగ్ ఈనెల 14న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు.

మూడో విడతకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజు అభ్యర్థులను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు. మూడో విడత పోలింగ్‌ను ఈ నెల 17న నిర్వహించనున్నారు. తొలి విడత పోలింగ్ ఈనెల 11న తేదీన నల్లగొండ, చండూరు డివిజన్లలో జరగనుంది.

సర్పంచ్ స్థానాలకు 1,962 నామినేషన్లు వార్డులకు 5,606

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు తొమ్మిది మండలాల్లోని 269 గ్రామ పంచాయతీల్లో 1,962 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 2,206 వార్డు ఉండగా, 5,606 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆరు వార్డులకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని అధికారులు పేర్కొన్నారు.

మూడో విడత నామినేషన్లు ఇలా..

మండలం	పంచాయతీలు	సర్పంచ్ నామినేషన్లు	వార్డు స్థానాలు	నామినేషన్లు
చందంపేట	30	227	250	622
చింతపల్లి	36	207	294	798
దేవరకొండ	41	318	316	837
గుడిపల్లి	12	103	104	269
డిండి	39	271	326	840
గుర్రంపోడు	38	278	314	770
కొండమల్లేపల్లి	27	190	216	526
నేరేడుగొమ్ము	21	178	170	437
పీఏపల్లి	25	190	216	507
మొత్తం	269	1,962	2,206	5,606

క్రీస్తు బోధనలను ఆచరించాలి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలను ఆచరించి జీవితాలను సుఖమయం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం క్లాక్ టవర్ సెంటర్‌లోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో రోమన్ క్యాథలిక్ బిషప్ కె.ధమన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యునైటెడ్ క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి మాట్లాడుతూ, ఏసు క్రీస్తు ప్రేమ, దయ, క్షమ, మానవత్వంతో జీవించడాన్ని బోధించారని, ఆ బోధనలు కోట్లాది మంది ప్రజలపై చెరగని ముద్ర వేసిందన్నారు. పట్టణంలోని అన్ని చర్చిల సంఘకాపరులు, కమిటీలు కలిసి ఐక్యంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం జెన్నీ క్రిస్టఫర్ ఏసు సందేశాన్ని ప్రవచించారు.

క్వాయర్స్ పాడిన భక్తి గీతాలు అలరించాయి. అనంతరం సామూహికంగా కొవ్వొత్తులు వెలిగించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని బైబిల్ బోధనలను ఆలకించి పరవశించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చర్చి ప్రెసిడెంట్ టీఎస్.క్రిస్టఫర్, ప్రవీణ్‌కుమార్, జీవన్, జోసఫ్, పసల శౌరయ్య, మోజెస్, రేఖల భద్రాద్రి, ఏలేషా, శామ్యూల్, వినయ్‌కుమార్, అంబిక, తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను, కార్యకర్తలతో పాటు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని చండూరు వద్ద అరెస్టు చేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు పిల్లి రామరాజును అరెస్టు చేశారు. ఎంజీయూలో బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



నల్లగొండ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన నేతలు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మర్రిగూడ బైపాస్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ శంకర్, ఏర్పుల రవి, ఖయ్యుంబేగ్, కత్తుల సహదేవ్ పూలమాలలు వేశారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ తదితరులు నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బకరం శ్రీనివాస్ మాదిగ, బొజ్జ దేవయ్య తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

నాయకులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ పెంచేందుకు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, అందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థులకు సహకరించని నాయకులు, కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు నూక కిరణ్ కుమార్ యాదవ్, గుజిలాల్ శేఖర్‌బాబు, తాళ్లూరి మురళి, చాడ సురేష్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, నోముల జనార్దన్, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం

రిజర్వాయర్ ముంపు గ్రామాల ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు కేశవులు

మర్రిగూడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్, పునరావాసం కల్పించకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని చర్లగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామాల ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు వల్లపుదాస్ కేశవులు అన్నారు. శనివారం మర్రిగూడలో విలేకరులతో మాట్లాడుతూ, డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్‌తో నాలుగు గ్రామాలు నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి, వెంకపల్లితండా పూర్తిగా ముంపునకు గురవుతున్నాయన్నారు. నిర్వాసితులకు పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 17 ఏళ్లు గడుస్తున్నా ఆ హామీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గ్రామాల్లో 1,255మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. నిర్వాసితులు పలుమార్లు ఉద్యమాలు, ధర్నాలు, నిరసనలతో పనుల నిలిపివేసినప్పుడల్లా ఉన్నతాధికారులు రావడం, హామీ ఇవ్వడంతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేదంటే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటామనే నెపంతో నిర్వాసితులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. జిల్లాలో ఎక్కడ బహిరంగ సభ నిర్వహించినా నిర్వాసితులను అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. పోలీసులు రాత్రికి రాత్రి వచ్చి ప్రభుత్వ ఉద్యోగులని కూడా చూడకుండా, పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను సైతం అరెస్ట్ చేసి బలవంతంగా వాహనాల్లో తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, కేసులు పెట్టినా తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో ఎరుకల యాదయ్య, భీమనపల్లి వెంకన్న, వెంకటయ్య, నరసింహ, రాములు, అంజయ్య, జంగాలు, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న నిర్వాసితులు

కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లు ముట్టడిస్తాం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘం నేతలు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లను ముట్టడిస్తామని, బీసీ ప్రజాప్రతినిధులు పదవులకు వెంటనే రాజీనామా చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌ల చట్టాన్ని పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్లను ఇస్తామని మాటతప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరే సాయి ఈశ్వరచారి ఆత్మహత్యకు కారణమన్నారు. ధర్నాలో బీసీ నాయకులు కాసోజు విశ్వనాథం, నల్లసోమ మల్లన్న, జెల్లా ఆదినారాయణ, కొల్లోజు సత్యనారాయణ, కేశబోయిన శంకర్, వాడపల్లి సాయిబాబా, రాచకొండ గిరి, సీతారాములు, హరిప్రసాద్, చలమయ్య, చంద్రశేఖర్, విష్ణుమూర్తి, సత్యనారాయణ, రమణాచారి, వెంకటాచారి, కిషన్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరచారిది ప్రభుత్వ హత్యే

(ఆంధ్రజ్యోతి, రామగిరి): బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసినందుకే ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యగానే భావించాల్సి వస్తుందని స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి అన్నారు. సాయి ఈశ్వరచారి మరణంపై సంతాపంగా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యకర్తలు శనివారం పట్టణంలోని సిమెంట్ రోడ్డు నుంచి క్లాకటవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం వల్లే ఈశ్వరచారి ఆత్మ బలిదానం చేసుకున్నాడన్నారు. అతడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పిల్లల చదువులకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లోజు సత్యనారాయణచారి, కాసోజు విశ్వనాథం, చోల్లేటి హరిప్రసాద్, తాడూరి చల్మయ్య, గొట్టిముక్కల చంద్రశేఖర్, కూరెళ్ల మదనాచారి, పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

చండూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్, పంచాయతీ ఎన్నికల్లో గెలవాలని బహిరంగ సభల పేరుతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కుట్ర పన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం మర్రిగూడ మండలం శివన్నగూడలో చెల్లి ఇంట్లో శుభకార్యానికి వెళ్తుండగా చండూరు పట్టణ శివారులో ఆయన్ను నల్లగొండ పోలీసులు అడ్డుకున్నారు. దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ నేపథ్యంలో భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు ఇంటికి వెళ్లగా, ఆయన అప్పటికే బయల్దేరడంతో విషయం తెలుసుకున్న నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ ఎస్సై సైదులు భూపాల్‌రెడ్డి వాహనాన్ని వెంబడించి రెండు గంటలకుపైగా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు అప్పటికే అక్కడికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెల్లి ఇంట్లో శుభకార్యానికి వెళ్తుంటే అడ్డుకోవడమేటని భూపాల్‌రెడ్డి పోలీసులను నిలదీశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17శాతానికే పరిమితం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ద్రోహానికి బీసీ బిడ్డ బలయ్యాడన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మి, ఆమె భర్త యాదగిరిపై దాడులు చేసిన వ్యక్తులపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఘటనకు కారకుడైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్, నాయకులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, వెంకన్న, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనులు, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రానికి రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే పార్టీ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొంటారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చా జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరుకావాలని కోరారు.

రెండు రంగుల్లో బ్యాలెట్

● సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ ● వార్డు సభ్యులకు తెలుపు రంగు ● బ్యాలెట్లపై అభ్యర్థుల పేర్లు ఉండవు

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలు ఉపయోగించగా త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను మాత్రం బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒక్కో పంచాయతీలో ఓటరు ఒకటి సర్పంచ్‌కు, మరొకటి వార్డు సభ్యుడికి ఇలా రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఓటర్లకు అందజేసే బ్యాలెట్ పత్రాలు రెండు రంగుల్లో ఉంటాయి. సర్పంచ్ అభ్యర్థులవి గులాబీ, వార్డు సభ్యుల బ్యాలెట్లు తెలుపు రంగులో ఉంటాయి. బ్యాలెట్ పత్రాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు ఉండవు. కేవలం అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు మాత్రమే కనిపిస్తాయి. సర్పంచ్ అభ్యర్థులకు 30, వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయించారు. బ్యాలెట్ పత్రం చివరలో నోటా గుర్తు ఉంటుంది. పంచాయతీ ఎన్నికల్లో కూడా బ్యాలెట్ చివర్లో నోటాను వినియోగిస్తున్నారు. పైఅభ్యర్థులు నచ్చకపోతే ఓటరు నోటాకు ఓటు వేయవచ్చు. ఒక్క బ్యాలెట్ పేపరులో ఎనిమిది గుర్తులతో పాటు చివరలో నోటా గుర్తుకు స్థానం ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ సంఖ్య దాటితే మరో బ్యాలెట్ పేపరును జతచేస్తారు. అంటే ఎక్కడైనా ఎనిమిది మందికి మించి బరిలో ఉంటే అదనపు బ్యాలెట్ వినియోగిస్తారు. కాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకుంటున్నాయి. బ్యాలెట్ పెట్టెలు, ఇతర పోలింగ్ సామాగ్రిని సంబంధిత సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ కేంద్రంలో ఒక్కో వార్డు బ్యాలెట్ పెట్టెను వరుసగా తెరచి, ముందుగా వార్డు సభ్యుల ఓట్లు లెక్కిస్తారు. తర్వాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్లను ఒక చోటకు చేర్చి వాటిని పాతిక చొప్పున కట్టలుగా కట్టి వాటిని ఓ డ్రమ్ములో వేసి కలిపిన మీదట లెక్కిస్తారు. ఒకవేళ అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చినప్పుడు లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు.

సంగ్రామం

ఎన్నికల వేళ నిఘా తీవ్రం

సూర్యాపేట జిల్లాలో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సమీపిస్తోంది. మూడు విడతల్లో నిర్వహిస్తున్న ఎన్నిలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అదేవిధంగా మొదటివిడతలో గుర్తులు కేటాయింపుతో ప్రచారం ఊపందుకుంది. రెండో విడతలో అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ నెల 9న మూడో విడతలో అభ్యర్థులు ఖరారు కానున్నారు. విజయం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. ఎన్నికలకు సంబంధించి డబ్బు, మద్యం, ఇతర ఏమైనా వస్తువులు రవాణా, పంపిణీ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో పోలీస్ నిఘా మరింత తీవ్రమైంది. పోలింగ్ ప్రక్రియకు పోలీస్‌శాఖ సన్నద్ధమవుతోంది. ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. అంతేకాక 68 ప్రత్యేక తనిఖీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయి. బైండోవర్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే లైసెన్సు కలిగిన 59 ఆయుధాలను డిపాజిట్ చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా పరిస్థితులపై అధికారులు మరోసారి అధ్యయనం చేయనున్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగించాలని అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రతీ భాగాన్ని వారి ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఈ మేరకు ప్రధానంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

24 గంటలు తనిఖీలు

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్పీ నర్సింహ జిల్లాలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయో ఆ సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు



వద్ద, చింతలపాలెం మండలంలోని దొండపాడు, మఠంపల్లి మండలంలోని మట్టపల్లి, తిరుమలగిరి, మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి, మోతె మండలంలోని మామిళ్లగూడెం, సూర్యాపేట మండలంలోని టేకుమట్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు రాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాకు వచ్చిన వాహనం, వ్యక్తులు పూర్తిస్థాయి తనిఖీ తర్వాత లోపలికి, బయటికి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటున్నాయి.

సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను పోలీస్ అధికారులు గుర్తించారు. 486 పంచాయతీల్లో 170 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. మొదటి విడతలో 159 గ్రామాలకు 47 గ్రామాలు, రెండో విడతలో 181 గ్రామాలకు 65 గ్రామాలు, మూడో విడతలో 146 గ్రామాలకు 58 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో ఇదివరకు వివిధరకాల కేసులు నమోదైన వ్యక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వారితో సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలోని యువత, పెద్దలతో మాట్లాడి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై, పోలింగ్ ఎలా చేయాలో కళాజాత ప్రదర్శన ద్వారా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఓటు ప్రాముఖ్యం తెలపడంతో పాటు ఎన్నికల్లో ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే ఎలాంటి కేసులు నమోదు చేస్తారో వాటి ప్రభావం భవిష్యత్‌పై ఎలా ఉంటుందో అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారితో పాటు గతంలో కేసులు నమోదైన వారిని మళ్లీ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ముందస్తుగా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పూచీకత్తుతో బైండోవర్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 549 మందిని బైండోవర్ చేశారు.

68 ప్రత్యేక తనిఖీ బృందాలు

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా పోలీసులు 68 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. అందులో నాలుగు స్పెషల్ సెక్యూరిటీ టీంలు, 23 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు, 23 ఫ్లయింగ్ సర్వేలెన్ టీంలు, 18 పోలీస్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు ఏర్పాటుచేశారు. ఈ టీంలు జిల్లా వ్యాప్తంగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రతి వాహనాన్ని, అనుమానం ఉన్న వ్యక్తులను తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల్లో అధికారులు పూర్తి స్థాయిలో నిఘా ఉంచనున్నారు. డబ్బు, మద్యానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. ఇక గ్రామాల్లో సైతం ఎప్పటికప్పుడు సమాచార సేకరణ కోసం ప్రత్యేకంగా వ్యవస్థ ఏర్పాటుచేశారు. గ్రామపోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో వారికి కేటాయించిన గ్రామాలకు సంబంధించిన వివరాలు సేకరించాలని ఆదేశాలు ఇచ్చారు. డబ్బు, మద్యం పంపిణీలపై నియంత్రణ కోసం అధికార యంత్రాంగం పాటుపడాల్సి ఉంటుంది.


● ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. పోలింగ్ కేంద్రాల వారీగా బందోబస్తు సిద్ధం చేశాం. జిల్లాలో చెక్‌పోస్టులతో పాటు పోలీస్‌స్టేషన్ల వారీగా తనిఖీలు చేపడుతున్నాం. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే వెళ్లేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశాం. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

కొత్తపల్లి నర్సింహ, జిల్లా ఎస్పీ సూర్యాపేట.

ఏందన్నా..జనం కనిపిస్తలేరు..



(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ(వ్యవసాయం)

గీ పొలం పనులు ఉన్నపుడే ఎలచ్చన్లు అచ్చినయి.. పచారం కోసం ఓని ఇండ్లకు పాయినా పిల్లాజెల్లా కనిపిస్తలేరు.. పొద్దుగల ఇండ్లకెళ్లిపోతే.. పొద్దుపోయిందాక ఇంటికొత్తలేరు.. గిపుడే వరి నార్లు పోసుకుని బురద దమ్ములు చేత్తుండ్రు.. జనం అంతా గా పన్లనే ఉన్నరు..ఓట్లు అడుగుదామని మనం రోడ్ల మీద తిరుగుతున్నం.. తిరిగి తిరిగి కాళ్లు, దండాలు పెట్టి చేతులు నొత్తున్నయి తప్ప పనిగాట్లే.. గిట్టయితే ఇంక మన గెలిసేదెట్ల సెప్పు.. సాగర్ ఆయకట్టులో యాసంగి వరి సాగులో రైతులు నిమగ్నం కావడంతో పక్క పక్కన ఊళ్లల్ల ఉన్న ఇద్దరు సర్పంచు అభ్యర్థుల మధ్య ఆసక్తిరమైన చర్చనే నేటి రచ్చబండ..

రాములు: ఏ ఎల్లన్నా ఎట్లున్నవ్.. గంతా మంచిగనేనా.. మీ ఊళ్ల సర్పంచ్ కోసం నామినేషన్ ఏసినవంటగా ఎట్లుంది పచారం?

ఎల్లన్న: ఏం సెప్పమంటువ్ సెప్పు.. మంచిగనా పాడా.. తిరిగి బేజారయితున్నా.. ఎపుడు మన ఇళ్లకే జనం వచ్చేటోళ్లు.. గియ్యాల మనం ఇళ్లు ఇళ్లు తిరగాల్సిన పరిత్తితి అచ్చింది. గిపుడు పొలం పనులు అయినయి.. పగలు జనం ఉండట్లేదు.. తెల్లారుగట్ల పచారం సేయలేం, రాత్రిళ్లు అంతా అలసి పోయింటుద్రు.. ఓట్లు అడుగుడు శానా కష్టంగ ఉంది.. ఎల్లచ్చన్లు దగ్గరకొస్తున్నయి.. ఏం సేయాలో అర్థం కాట్లే..

రాములు: పచారానికి జనం దొరకట్లే గందరు పన్లకే పోతున్నరు.. పది మంది ఎంటేసుకుని తిరగలన్నా.. కూలి ఇత్తినే వత్తున్నరు.. మన తాతల కాలంల ఎలచ్చన్లు గిట్ల లేకుండే..నాయకుడు అంటే జనానికి గుండెల్ల అభిమానం ఉండేది..పైస ఖర్చు లేకుండా మందీ మార్బలం తరలి వచ్చేటోళ్లు. గపుడు గింత సార్థం లేకుండే.. గియాలా.. రాజకీయలే మారినయి.. ఏం సేద్దాం.. గిపుడు కాలంతో పాటు జనం బాగా మారి పోయింద్రు.. ఆళ్లను సూసి మన గట్టనే అయినం..

ఎల్లన్న.. అందరి పరిత్తితి గింతే ఉంది రామన్నా.. జనానికి బాగా అర్థం అయినంటుంది... ఎవరి బతుకుతెరువు ఆళ్లు సూసుకుంటున్నరు.. పతి ఒక్కరు మా కేంది అనుకుంటున్నరు.. మనల్ని ఆళ్లు పట్టించుకోవట్లే.. మనం గెలిసినకా ఆళ్లని మరిచిపోతుంటిమి గదా.. యథా రాజా తథా ప్రజా అన్నారుగా పెద్దలు.

రాములు: గదీ నిజమే మన సేతుల ఏ ముంది సెప్పు..లోకంతో పాటు మనం ఇంక పాయెత్త..

ఊరు మంచిగుండాలే

రచ్చబండ RACHABANDA



పంచాయతీ ఎన్నికల నామినేషన్లు శుక్రవారం ముగియడంతో గ్రామాల్లో కోలాహలం మొదలైంది. ఊళ్లలో వాతావరణం వేడిగా మారింది. తమ వాడినే గెలిపించుకుంటామని ఒక వర్గం. మా కాలనీ పెద్దనే సర్పంచ్ చేస్తామంటూ మరో వర్గం మాటలు తూటాలు పేలుస్తున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఊర్లో వీధి అరుగుల వద్ద, చాయ్ హోటళ్ల వద్ద పెద్దమనుషులు మాట్లాడుకుంటున్న ముచ్చట చూద్దాం..

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

రామయ్య: అరే నరసన్న ఎటు పోతున్నవే ఇటు రాయే. ఓ చాయ్ తాగుదువుగానీ.

నర్సయ్య: ఓ రామన్న వస్తున్నా.. ఓ చాయ్ అయితే సరేలే మల్లన్న.

రామయ్య: (హోటల్ యజమానితో) నర్సయ్యకు చాయ్ ఇవ్వవే..

నర్సయ్య: మల్లన్న ఊల్లే ఏం అనుకుంటున్నరే. చాయ్ తాగుతూ.. సర్పంచ్ ఎలచ్చన్లు కదా పడుచు పోరగాండ్లు ఉడుకు రక్తంతో ఆగుతలేరే.

మల్లయ్య: అవునే నర్సన్న పోరగాండ్లు ఆగుతలేరు. మనప్పుడు గిట్ల లేదే. గప్పుడు పెద్దమనుషులకు మర్యాద ఇచ్చేవాళ్లం. ఇప్పుడు చుట్ట పోన్ని కూడా చూత్తలే. అక్క, తమ్ముడు అనే బంధామే లేదు. ఎలచ్చన్లు ఎట్ల గెల్వాలనే చూత్తుండ్రు. చిన్న, పెద్ద అని చూత్తలేరు.

నర్సయ్య: అవునే రామన్న. మా కులపోడిని గెలిపించుకుంటామని మీది వాడకట్టోళ్లు.. మా గల్లీ లీడర్‌ను గెలిపించుకోవడానికి కింది వాడకట్టోళ్లు తిరుగుతుండ్రే

రామయ్య: అవునే.. మొన్నటి దాక ఈల్లందరు కలిసే తిరిగింద్రు గిప్పుడు ఎలచ్చన్లు అనుడుతోనే ఎవనోన్ని వాడు గెలిపించుకుంటామంటూ ముఠాలు కట్టింద్రు. లడాయిలు కూడా పెట్టుకుంటుంద్రు.

నర్సయ్య: ఎవనికి వాడే.. మా కులపోడు. మా గల్లోడు అంటు గ్రూపులు కడుతుండ్రే. గిప్పుడు ఊల్లే ఐదారు గ్రూపులైనై. పొద్దుగాల చాయ్, టిఫిన్, రాత్రైతే మందు లొల్లి

రామయ్య: ఏమోనే.. గీ ఎలచ్చన్లు ఎట్ల అయిపోతయే. ఏ లడాయి లేకుండా ఎప్పటోలే ఊరు మంచిగుండాలనే నర్సన్న.

నర్సయ్య: అవునే..అందరికీ అదే మంచిది. మంచి గుండాలనుకుందాం. పోయ్యత్తనే రామన్న

రామన్న: సరేనే నరసన్న నేను ఇంటి దిక్కు పోతా పొద్దుగూకుతోంది. ఇలా ఇద్దరు మిత్రులు హోటల్లో గరంగరం చాయ్ తాగి, సాయంత్రం కావడంతో వాళ్ల ఇళ్లకు వెళ్లిపోయారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రం లో నరసింహుడి నిత్యకల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపై వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. పాదప్రక్షాళ నం మధుపర్క పూజలు యథావిధిగా నిర్వహించారు. మంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణల అనంతరం దివ్యమూర్తులకు గరు డోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్యాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు తూమాటి రామాచార్యులు, కుమ్మరికుంట్ల బదరీ నారాయణచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో అజ్మీర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తరలిస్తున్న మద్యం పట్టివేత

తుంగతుర్తి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి డిప్యూటీ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని గానుగుబండ గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనం వెళ్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై ఎస్సారెస్పీ కాల్వ నుంచి వెళ్తుండగా వెంబడించారు. వారు 9.600 లీటర్ల మద్యం, 13 బీర్లు వదిలి వెళ్లారని, వాటిని స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మద్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇందుగులలో నిలిచిన ఎన్నికల ప్రక్రియ

● నామినేషన్ల వరకే పరిమితం

● ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు



మాడ్గులపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా నామినేషన్ల ప్రక్రియ మాత్రమే చేపట్టాలని హైకోర్టు శుక్రవారం సూచించింది. రిజర్వేషన్‌లో భాగంగా ఇందుగుల గ్రామ పంచాయతీ ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. ఇందుగుల గ్రామానికి చెందిన చింతమళ్ల రాంప్రసాద్ ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాంప్రసాద్ త్రిపురారం మండలం చౌళ్లతండాకు చెందిన చింతమళ్ల కల్పన అలియాస్ ధరావత్ కల్పనను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ తండా నుంచి ఆమె తన ఓటు హక్కును ఇందుగుల గ్రామానికి బదిలీ చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలో గ్రామానికి చెందిన ధరావత్ కల్పన పేరు లేకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించింది. ఆమె పేరును తక్షణమే మాడ్గులపల్లి మండల ఓటరు జాబితాలో చేర్చాలని హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పునిచ్చింది. దీంతో కల్పన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసింది. బుధవారం నామినేషన్లను పరిశీలించిన అధికారులు ఓటరు జాబితాలో కల్పన పేరు లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించారు. ఆమె చేసేదేమీ లేక సబ్‌కలెక్టర్, ఎన్నికల అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆమె మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా, ఈ నెల 15వ తేదీ వరకు ఇందుగుల గ్రామ పంచాయతీ నామినేషన్ ప్రక్రియ చేపట్టాలని, తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఎన్నికల ప్రక్రియ చేపట్టవద్దని ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఈ గ్రామ అభ్యర్థులకు ఎన్నికల అధికారులు 6వ తేదీన విడుదల చేయాల్సిన గుర్తుల ప్రక్రియను నిలిపివేశారు. గ్రామంలో మొత్తం 1,926 మంది ఓటర్లు ఉన్నారు.

ఈ నెల 14వ తేదీన రెండోవిడత ఎన్నికలు జరగాల్సి ఉండగా, హైకోర్టు ఆదేశాల మేరకు 15వ తేదీ వరకు నిలుపుదల చేసి కోర్టు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించింది. దీంతో గ్రామం నుంచి కల్పనతో సహా ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసి ఎన్నిక వాయిదా పడడంతో అభ్యర్థులు గందరగోళంలో ఉన్నారు. ఈ నెల 15వ తేదీన వచ్చే తీర్పు కోసం గ్రామస్థులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పత్తి కూలీల ట్రాక్టర్ పల్టీ



మలుపు వద్ద పల్టీకొట్టిన ట్రాక్టర్

చింతలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి టాక్టర్ పల్టీ కొట్టి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో శనివారం సాయంత్రం జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం చింతలపాలెం మండలకేంద్రం పరిధిలోని సిమెంట్ పరిశ్రమ సమీపంలో పత్తి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ పొలాల్లో మలుపు వద్ద గట్టు ఎక్కి పల్టీ కొట్టింది. దీంతో ట్రాలీలో ఉన్న ఇద్దరు కూలీలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు వెంటనే చికిత్స నిమిత్తం వారిని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోతే చట్టాన్ని ఆశ్రయించాలి



రైతులతో మాట్లాడుతున్న కార్యదర్శి మాధవీలత

భువనగిరి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలతో మోసపోయే రైతులు వినియోగదారుల కోర్టును ఆశ్రయించవచ్చునని యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వీ మాధవీలత అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం హుస్నాబాద్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు నిర్వహించాన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. తేకంలో తేడాలు ఇతరత్రా నష్టాలపై హెల్ప్‌లైన్ నెంబర్ 15100కు ఫోన్ చేయవచ్చునని లేదా జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చునని సూచించారు. రైతుల హక్కులు, వ్యవసాయ సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం కేజీబీవీని తనిఖీచేసి విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, విద్యాహక్కు చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిని జయిస్తే చదువులో ఉత్తమఫలితాలు సాధించవచ్చునన్నారు. అలాగే బాల సదన్, గ్రేస్ చిల్డ్రన్ హోంను సందర్శించి తనిఖీలు చేశారు. ఆమె వెంట పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నామినేషన్ సమయంలో ఇరువర్గాల ఘర్షణ



పోలీసు ప్రజాభరోసాలో మాట్లాడుతున్న సీఐ ప్రతాప్ లింగం

చింతలపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎన్నికల బరిలో ఉన్న రెండు వేర్వేరు వర్గాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన దాడులతో గ్రామంలో భయాందోళన వాతావరణం ఏర్పడింది. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. సర్పంచ్ అభ్యర్థులుగా దాదాబుడి వర్గానికి చెందిన అభ్యర్థి తన అనుచరులతో కలిసి ఇస్మాయిల్ వర్గానికి చెందిన నాయకుడు, వార్డుసభ్యుల అభ్యర్థుల ఇళ్లపై కర్రలు, రాళ్లు, గొడ్డళ్లు, బీరు సీసాలతో దాడికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ దాడిలో మూడు ద్విచక్ర వాహనాలు, ఇళ్లలోని సామాగ్రి ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. దాడులను నిలువరించి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈఘటనపై పోలీసులు ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, బైండోవర్ కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం తెలిపారు. అనంతరం అదే గ్రామంలో పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక అంశాలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సహకారం లేకుండా పోలీసు న్యాయవ్యవస్థ పటిష్టంగా పనిచేయడం సాధ్యం కాదన్నారు. ప్రజలంతా చట్టాన్ని గౌరవిస్తూ అన్యాయాన్ని సహించకుండా ముందుకు వస్తే పోలీస్ శాఖ మేమున్నామంటూ భరోసా ఇస్తుందని వెల్లడించారు. సమాజంలో మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడకుండా చదువులపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సందీప్‌రెడ్డి, మేళ్ల చెర్వు, ఎస్ఐ పరమేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల వేళ వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లోని జాతీయరహదారిపై వాహనాల బారులు

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల వేళ యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65)పై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. వారాంతం కావడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. అందులోనూ పంచాయతీ ఎన్నికలు ఉండడంతో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన వ్యక్తులు ప్రచారం కోసం వెళ్లినట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. మూడు విడతలకు సంబంధించిన ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో ప్రచార పర్వం జోరందుకుంది. దీంతో హైదరాబాద్‌లోని వ్యక్తులు తమతమ అభ్యర్థుల గెలుపు కోసం ఒకటి, రెండు రోజులు ప్రచారం చేయడంతో పాటు ఓటర్ల మద్దతును కూడగట్టడం కోసం నగరం నుంచి ప్రముఖులు తరలివెళ్లినట్టు తెలుస్తోంది.

గోవుల తరలింపులో ఇద్దరిపై కేసు

అడ్డగూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా గోవులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా పాకరావుపేట మండలంలోని నామవరం గ్రామానికి చెందిన మేకల శ్రీను అదేగ్రామానికి చెందిన పోకుర్తి శివలు ఆవుదూడలను కొనుగోలు చేసి ట్రాలీలో అక్రమంగా రవాణా చేస్తున్నారు. తొర్రూరు-వలిగొండ రహదారిపై బొడ్డుగూడెం సమీపంలో శుక్రవారం రాత్రి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. గోవులను రాజాపేటలోని గోశాలకు తరలించి, వాటిని తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినటు ఎస్ఐ తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, కొండమల్లేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభతోపాటు మున్సిపాలిటీలో రూ.20 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపనకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌తోపాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సీఎం బహిరంగసభకు నియోజకవర్గం నుంచి మహిళలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

మహిళా సంఘాలకు రూ.11కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.11కోట్ల 33 లక్షల 46వేల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో రాణించాలని, మహిళ సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు సీఎం తెలిపారు.

సీఎం సభకు భారీ పోలీస్ బందోబస్తు

దేవరకొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్, సభ ప్రాంగణం, వీఐపీ పార్కింగ్, పబ్లిక్ పార్కింగ్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ పర్యవేక్షణలో ఇద్దరు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 36 మంది సీఐలు, 115మంది ఎస్‌ఐలతో మొత్తం 1250 మంది బందోబస్తులో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణులతోపాటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

- దేవరకొండ పట్టణంలోని ముదిగొండ రోడ్డులో నిర్వహించిన ముఖ్యమంత్రి బహిరంగ సభలో పాల్గొనేందుకు మధ్యాహ్నం 3:10 గంటలకు వచ్చారు.
- మధ్యాహ్నం 3.13 గంటలకు రూ.20కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- మధ్యాహ్నం 3.16 నిమిషాలకు సభా స్థలికి చేరుకున్నారు.
- 3.54 నిమిషాలకు ప్రారంభమైన సీఎం ప్రసంగం సుమారు 33 నిమిషాల పాటు కొనసాగింది.
- ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ పాడిన రేవంతన్న పాట ఆడియోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.
- సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికగా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార చిహ్నం పూర్ణకుంభ నమూనా అందజేశారు.
- దేవరకొండకు మొదటిసారిగా వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

కొడంగల్‌లా దేవరకొండను అభివృద్ధి చేయాలి

● రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ● రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేసి సాగునీరు అందిస్తాం : భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా, మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, ఎమ్మెల్యే బాలు







మాట్లాడుతున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వెనుకబడిన దేవరకొండ నియోజకవర్గాన్ని కొడంగల్ నియోజకవర్గం మాదిరిగానే నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో శనివారం జరిగిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో సమస్యలు గుట్టలుగా ఉన్నాయన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీశైలం సొరంగ మార్గాన్ని కుర్చీ వేసుకొని కూర్చొని తవ్విస్తానని హామీ ఇచ్చి నియోజక వర్గ ప్రజలను మోసం చేశారన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానన్నారు. కంభాలపల్లికి డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దేవరకొండ నియోజకవర్గంలో గతంలో ఆడపిల్లలను అమ్ముకునే వారని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా శ్రీశైలం సొరంగమార్గాన్ని ప్రారంభించారని, మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తారని అన్నారు.

రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ పూర్తి చేసి సాగునీరు

రెండేళ్లలో శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తిచేసి సాగునీరు అందిస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో జరిగిన ప్రజా విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేవరకొండ మండలం ముదిగొండ మా అమ్మమ్మ ఊరని, ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించి రుణం తీర్చుకుంటానన్నారు. రాష్ట్రంలోనే దేవరకొండ నియోజకవర్గానికి 14వేల రేషన్‌కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎదుళ్ల నిర్మాణానికి రూ.1800 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ పనుల మరమ్మతులకు రూ.442 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పెండ్లిపాకల, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల పనులు త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన అంభభవాని, పెద్దగట్టు, ఏకేబీఆర్, కంభాలపల్లి, పొగిళ్ల ఎత్తిపోతల పథకం పనులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని తెలిపారు. మిర్యాలగూడ నియోజక వర్గంలో ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతమైన దేవరకొండను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలి : బాలు

దేవరకొండ నియోజకవర్గంలో ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. దేవరకొండలో జరిగిన ప్రజాపాలన ప్రజావిజయోత్సవ సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంపై దృష్టిసారించి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. దేవరకొండ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలకు నిధులు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల నూతన భవనాలు నిర్మించాలన్నారు. ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లపై వెళ్లాలంటేనే బాధపడే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ప్రధాన ప్రాజెక్టులతోపాటు ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. దేవరకొండలో మైనార్టీ ఉర్దు మీడియం పాఠశాల మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, సామేల్, డాక్టర్ వంశీకృష్ణ మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకుడు పల్లా నర్సింహారెడ్డి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్ సతీమణి జ్యోతి, దేవరకొండ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంఏ. సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జాల నర్సింహారెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, లోకసాని శ్రీధర్ రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్, జూలూరి ధనలక్ష్మి బాలనారాయణగౌడ్, దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, ఎండీ. యూనుస్, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ, డిండి పూర్తి చేస్తాం

(5వ పేజీ తరువాయి)

దేవరకొండ నియోజకవర్గంలో చేపట్టిన అన్ని ఎత్తిపోతల పథకాలను తమ హయాంలో పూర్తిచేస్తామన్నారు. ఈ నియోజకవర్గ మనుమడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్నారని, నిధులు నీళ్లలా పారించి పనులు చేయిస్తారన్నారు. నల్లగొండ జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమని, ఇక్కడి గాలికి, నీటికి కూడా పోరాట పౌరుషం ఉంటుందన్నారు. నిరంకుశ పాలన చేసిన నిజాములను, దిగంతాలను తరిమిన గడ్డ ఇదని కొనియాడారు. ఆధిపత్యానికి, దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం సాయుధరైతాంగ పోరాటం చేసిన గడ్డ అని అన్నారు. రావి నారాయణరెడ్డి, ధర్మ భిక్షం, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, బీఎన్‌రెడ్డి, దొడ్డి కొమురయ్యని తల్చుకోకుంటే నల్లగొండ చరిత్ర అసంపూర్ణమేనని అన్నారు. దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో తండాలు, గ్రామాలు, మండలకేంద్రాలు, జిల్లాకేంద్రం, హైదరాబాద్‌కు వెళ్లేందుకు అవసరమైన అన్ని రోడ్లను తక్షణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, త్వరలో మంత్రులు లక్ష్మణ్‌కుమార్, కోమటిరెడ్డి, సీతక్క ఇక్కడికే వచ్చి అన్నిపనుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని హామీ ఇచ్చారు. దేవరకొండలో అసంపూర్తిగా ఉన్న వెంకటేశ్వర ఆలయ నిర్మాణం పూర్తికి అవసరమైన నిధులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దివంగత పార్లమెంటేరియన్ జైపాల్‌రెడ్డి దేవరకొండలో చదువుకున్నారని, ఆయన చదివిన పాఠశాల, కళాశాల అభివృద్ధికి నూతన భవనాల నిర్మాణానికి రూ.6కోట్ల నిధులిస్తామన్నారు. తనకు దేవరకొండతో అనుబంధం ఉందని, సీఎం తన బంధుత్వాలను వివరించడంతో సభికులు హర్షధ్వానాలు చేశారు.

గుట్ట టెండర్ల గడువు పొడగింపు

యాదగిరిగుట్ట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో గత నెల 22వ తేదీన దేవస్థానం అధికారులు ప్రకటన జారీ చేసి టెండర్లు ఆహ్వానించారు. ఔత్సాహికుల నుంచి టెండర్ల సమర్పణకు డిసెంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. కాగా, డిసెంబరు 2న నిర్వహించాల్సిన టెండర్లు ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి 4వ తేదీ, సివిల్ విభాగానికి సంబంధించి 8వ తేదీ వరకు గడువు పొడగించినట్లు సివిల్ ఈఈ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బయలుదేరుతున్న క్రీడాకారులు

ఆలేరు, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7న నిర్వహిస్తున్న 51వ జూనియర్ కబడ్డీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కబడ్డీ క్రీడాకారుల జట్టు శనివారం ఆలేరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడి నుంచి వారు రైలులో మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్యతో పాటు పూల చంద్రకుమార్, రిటైర్డు ఉపాధ్యాయులు మంద సోమరాజు, పరిగల రాములు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చింతల సాయిబాబా, లింగస్వామి వారిని కలిసి అభినందనలు తెలిపారు.

వట్టిమర్తి గ్రామవాసికి డాక్టరేట్



నర్రా లవేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా లవేందర్‌రెడ్డికి కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'నల్లగొండ జిల్లాలో రెడ్డి కుల సంప్రదాయాలు, అధ్యయనం' అనే అంశంపై ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు నర్రా లవేందర్‌రెడ్డికి తెలుగు శాఖ నుంచి డాక్టరేట్ ప్రకటించినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. నర్రా లవేందర్‌రెడ్డి ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖైరతాబాద్ తెలుగుశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

విశ్వహిందూ పరిషత్ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా సంపత్‌వర్మ



సంపత్‌వర్మ

రామగిరి, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) నల్లగొండ జిల్లా కార్యదర్శిగా నల్లగొండ పట్టణానికి చెందిన జూకూరి సంపత్‌వర్మ ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా విభాగ్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మల్లెబోయిన నర్సింహ, గుంటోజు రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, ధర్మప్రసార్ జిల్లా ప్రముఖ్‌గా కోటగిరి సంతోష్‌ను ఎన్నుకున్నారు. భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి రవికుమార్, తెలంగాణ ప్రాంత అధ్యక్షులు నర్సింహ్మామూర్తి సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సమాజాన్ని సంఘటితం, చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సంపత్‌వర్మ మాట్లాడుతూ భూమాత, గోమాత, దైవిక గ్రంథాలు, మఠ మందిరాలను పరిరక్షించేందుకు పని చేస్తామన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు ఉపేందర్, ఆనంద్, మెరుగు వంశీ, రాయల కృష్ణయ్య, సత్యవతి తదితరులు ఉన్నారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య పూజలు శనివారం శాస్త్రోక్తంగా జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవారిని ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేద మంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహా మండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.26,09,527 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. యాదగిరిగుట్ట స్వామి ఆశీస్సులతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సాధించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కుటుంబసమేతంగా ఆయన స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యాదగిరిగుట్ట స్వామిని దర్శించుకోవడం మహాద్భాగ్యమని చెప్పారు. స్వామి కృపతో రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా జీవించాలని, సుఖశాంతులతో విలసిల్లాన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ముకేష్ జైన్

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కెరీర్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలంటే నిరంతర అభ్యాసం అవసరమని క్యాప్‌జెమిని ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సీటీవో-ముంబై ముకేష్ జైన్ అన్నారు. 'కెరీర్ క్లారిటీ ఇన్ టెక్' అనే అంశంపై యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్ ప్రపంచం ఎల్లప్పుడూ మారుతూ ఉంటుందన్నారు. ఈ రంగంలో విజయం సాధించాలంటే జిజ్ఞాసతో ఎల్లప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. సమస్యలు, సవాళ్లు ఎదురైనప్పుడు భయపడకుండా వాటిని పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. వైఫల్యాల నుంచి నేర్చుకోవాలనే దృక్పథం ముఖ్యమన్నారు. ఇతరులతో కలిసి పనిచేయడం, అభిప్రాయాలను గౌరవించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఉద్యోగ జీవితంలో చాలా అవసరమి ఆయన వివరించారు. సంక్లిష్టమైన డేటాను లేదా వ్యవస్థలను అర్థం చేసుకునే, విశ్లేషించగలిగే సామర్థ్యం పెంపొందించుకోవాలన్నారు. టెక్నాలజీ వేగంగా మారుతున్న ట్రెండ్‌లకు అను గుణంగా తమను తాము ఎలా తీర్చిదిద్దుకోవాలో విద్యార్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి

విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సానుకూల దృక్పథంతో అవకాశాలుగా మార్చుకోవాలని హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ విజయ్ అన్నారు. పరిశోధన, ఇంజనీరింగ్ రంగాల్లో సవాళ్లు సహజమని, వాటిని చూసి భయపడకుండా, సమస్య పరిష్కారానికి తొలి అడుగుగా భావించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులను నిరాశగా కాకుండా కొత్త విషయాలు నేర్చుకోవడానికి సృజనాత్మకతను వెలికితీయడానికి అనువుగా దృష్టి మార్చుకోవాలన్నారు. యువ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు తమ చదువు పూర్తయినంత మాత్రాన నేర్చుకోవడం ఆపకూడదని, కొత్త టెక్నాలజీలను నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని ఆయన వివరించారు. పరిశోధనలో లేదా స్టార్టప్ రంగంలో గొప్ప విజయాలు సాధించాలంటే కొద్దిపాటి 'లెక్కించిన రిస్క్' తీసుకోవడానికి ధైర్యం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికి సిమా అవార్డు



అవార్డు అందుకుంటున్న యాదగిరి

నల్లగొండ రూరల్, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన జర్నలిస్ట్ రెడ్డిపల్లి యాదగిరికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు లభించింది. సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్(సిమా) ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో జగద్గురు సిద్ధేశ్వరస్వామి, సిమా అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణమూర్తి, ఎన్‌కే స్వామి నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. యాదగిరిని జర్నలిస్టులు అభినందించారు.



'రైతు పోరాటాలను తీవ్రతరం చేయాలి'

నకిరేకల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన విద్యుత్, విత్తనాల బిల్లులను వ్యతిరేకించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి పిలుపునిచ్చారు. మండలంలోని నోముల గ్రామంలో నిర్వహించిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు పోరాటాలను తీవ్రతరం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు గజ్జి రవి, రావుల లింగయ్య, బొమ్మిడి నగేష్, కుంచెం వెంకన్న, అంబటి నర్సయ్య, పజ్జూరు ఉపేంద్ర, వెంకన్న, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పీవో ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్

తిప్పర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పీవో ట్రైనింగ్ కార్యక్రమంలో రీసోర్స్ అధికారులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తిప్పర్తి మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో 216 వార్డులు ఉండగా 21 వార్డు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాయి. 26 గ్రామాల సర్పంచ్ స్థానాలకు 3 ఏకగ్రీవమవగా మిగతా 23 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల నిర్వాహణపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రీసోర్స్ అధికారులు శేషయ్య, శ్రీనివాస్, ప్రొసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణ



కట్టంగూరు: సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కట్టంగూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టంపల్లి, కలిమెర, కట్టంగూరు, చెరువుఅన్నారం, ఎరసానిగూడెం గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య తెలిపారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టంగూరుకు చెందిన ముక్కామల శేఖర్ శ్యామల, పిట్టంపల్లికి చెందిన చెగోని ప్రమీల సాయిలు, కలిమెరకు చెందిన తోటకూరి జలేంద్ర యాదయ్య, చెరువుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల సైదులు, ఎరసానిగూడెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన శంకర్ అధిష్ఠానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థులకు కాకుండా తామే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులమని తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకొని పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. వారిని, అధిష్ఠానం నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థులకే కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాదా యాదగిరి, నాయకులు గద్దపాటి దానయ్య, అయితగోని నర్సింహ, మిట్టపల్లి శివ, నూక సైదులు, కానుగు లింగయ్య, కొంపెల్లి యాదయ్య, రెడ్డిపల్లి స్వామి, గాదగోని వెంకన్న, పోగుల చంద్రయ్య, కొంపెల్లి సైదులు తదితరులు ఉన్నారు.

చండూరురూరల్: చండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న పలువురిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగిగూడెం గ్రామానికి చెందిన వట్టి శ్రీనివాస్, కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన రమేష్‌లను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు రెబల్స్ తలనొప్పి


చండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామాల్లో ఎన్నికల హడావుడి నెలకొంది. అందులో భాగంగా ప్రతీ గ్రామంలో ప్రచారం జోరుగా సాగుతోంది. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించగా పోస్టర్లు, కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు అదే పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థులు తలనొప్పిగా మారారు. ఒకే గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు బరిలో ఉన్న స్థానాల్లో అదే పార్టీకి చెందిన మరికొంత మంది పార్టీ అధిష్ఠానాన్ని ధిక్కరిస్తూ రెబల్స్‌లా బరిలో ఉన్నారు. దీంతో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పెద్ద తలనొప్పిగా మారింది. కొన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు మాకంటే మాకే ఓటేయ్యాలని ప్రచారం చేస్తుండటంతో ఇద్దరి మధ్య మూడో వ్యక్తి సులువుగా గెలవడం ఖాయమని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిలో ఎక్స్‌రే ద్వారా సమస్య తెలుసుకుని వైద్యులు తగు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి విజయ్‌కుమార్, ఎన్‌టీఈపీ సిబ్బంది అజయ్‌కుమార్, సైదులు, చంద్రకళ, వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృత్యుకుహరాలు

» ప్రమాదకరంగా రోడ్డు వెంట బావులు
» రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజల విన్నపం



65 జాతీయ రహదారి వెంట కొర్లపహాడ్ బస్‌స్టేజీ సమీపంలో ఉన్న ప్రమాదకర బావి

కేతేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రహదారుల వెంట ఉన్న వ్యవసాయ బావులు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. ఒకనాడు భూములకు సాగునీటిని అందించిన వ్యవసాయ బావులు నేడు వాటి వెంట విస్తరించిన రహదారులకు దగ్గరయ్యాయి. దీంతో రహదారిపై వచ్చీ పోయే వాహనాలు అదుపు తప్పిన సందర్భాల్లో ప్రమాదకర బావుల్లో పడటంలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. కేతేపల్లి మండలం గుండా వెళ్లే 65వ నెంబరు జాతీయ రహదారి వెంట ఇనుపాముల వద్ద గల వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ రహదారి దాదాపు 10 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ అదుపుతప్పిన వాహనం నేరుగా బావిలోకి పల్టీ కొట్టే ప్రమాదం ఉంది. బావిలోకి వాహనాలు పడిపోకుండా ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేసినా అవి అంతగా భద్రతనీయవనే అభిప్రాయం ఉంది. అలాగే 65వ నెంబరు జాతీయ రహదారిపై కొర్లపహాడ్ బస్‌స్టేజీ సమీపంలో సైతం ఓ బావి ప్రమాదకర స్థితిలో ఉంది. స్థానిక ఆంజనేయస్వామి గుడి పక్కన గల ఈ బావికి ఓ వైపు బారికేడ్ ఏర్పాటు చేసినా మరోవైపు బారికేడు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామీణ రహదారుల వెంట సైతం వ్యవసాయ బావులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మండలంలోని సూర్యాపేట-మిర్యాలగూడెం రహదారిపై భీమారం శివారులో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. అలాగే బొప్పారం, కాసనగోడు గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట గల బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు స్పందించి ఆయా రోడ్ల వెంట గల బావుల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదమరిస్తే...అంతే సంగతులు..!

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి నుంచి నక్కలపల్లికి వెళ్లే పీఆర్ బీటీ రోడ్డుపై ఓ చోట ఏర్పడిన భారీ గొయ్యి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఈ గుంతకు దగ్గరకు వచ్చి ఏ మాత్రమైనా ఆదమరిచారా ఇక అంతే సంగతులు. ఈ రోడ్డుపై గొయ్యి ఏర్పడి నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరద నీటి ప్రవాహానికి సిమెంట్ వైపు పగిలి రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. ప్రస్తుతానికి తాటి కొమ్మలు, కంప చెట్లతో రక్షణ కల్పించా రు. కానీ రోజులు గడుస్తున్నా గొయ్యికు మరమ్మతులు చేయకపోవడంతో పలువురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై గుంత కనిపించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ గొయ్యికు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అక్కెనపల్లి-నక్కలపల్లి రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న కైలాష్‌నేత



బీజేపీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయా పార్టీలు, సంఘాల నాయకులు అన్నారు. బీఆర్ అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మర్రిగూడ బైపాస్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో పాటు బొజ్జ శంకర్, ఏర్పుల రవి, ఖయ్యూంబేగ్, కత్తుల సహదేవ్, ఎంఎస్పీ జిల్లా బకరం శ్రీనివాస్ మాదిగ, బొజ్జ దేవయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

చిట్యాల: చిట్యాలలో వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పోకల దేవదాస్, నూనె వెంకటస్వామి, గ్యార శేఖర్, మేడి శంకర్, ఎరసాని గోపాల్, కొంపెల్లి సూర్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వీరేశం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాచర్ల సైదులు మాదిగ, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు తదితరులు, నాయకులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ సభ్యుడు, దళితరత్న అవార్డు గ్రహీత నాగిళ్ల మారయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, లింగయ్య, కొండల్, యాదగిరి, ముత్యాలు, యాదయ్య, రాములు, గ్యార యాదయ్య, సుధాకర్, అబి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో దొడ్డి యాదయ్య దంపతులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన యాదయ్యకు ఎమ్మెల్యే వేముల వీరేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చెర్వుగట్టులో కాంగ్రెస్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య, వార్డు సభ్యులు గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, పున్నంరాజు యాదగిరి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వారాల రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, కూకుట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు గ్రామాన్ని మెచ్చేలా అభివృద్ధి చేస్తా

● కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య

నార్కట్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు గ్రామ పంచాయతీని మీరు మెచ్చేలా అభివృద్ధి చేస్తానని, నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య ఓటర్లను అభ్యర్థించారు. శనివారం చెర్వుగట్టులోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చెర్వుగట్టు గ్రామం అభివృద్ధి చెందిందని ఇపుడు మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందజేయిస్తానని, అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని చెప్పారు. తనతో పాటు తన పానెల్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ బలపరిచిన వార్డు సభ్యులను కూడా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వారాల రమేష్, పున్నంరాజు యాదగిరి, గడుసు శశిధర్‌రెడ్డి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, కూకుట్ల గణేష్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెర్వుగట్టులో ఓటు అభ్యర్థిస్తున్న సర్పంచ్ అభ్యర్థి నేతకాని కృష్ణయ్య

నిబంధనలు తప్పకుండా పాటించాలి



చండూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

చండూరు రూరల్, డిసెంబరు 6: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలు నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉడుతలపల్లిలో నిర్వహించిన సెకండ్ స్టేజ్ ఆర్వో అండ్ పీవోల గ్రామపంచాయతీ ఎన్నికల ట్రైనింగ్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చండూరు రెవెన్యూ డివిజన్‌లో త్వరలో జరగబోయే మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీదేవి అన్నారు. బూత్ లెవల్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ఎదైనా సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకోవాలి

స్థానికసంస్థల ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల అధికారులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వినియోగించుకోవాలని మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయంలో నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేయడం చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చండూరు ఎంపీడీవో బి.యాదగిరి, ఎంఈవో సుధాకర్, ఎంపీవో సందీప్, జోనల్ ఆఫీసర్స్, మాస్టర్ ట్రైనర్ ఎం.వెంకటేశ్వర్లు, ప్రసాద్, ట్రైనింగ్‌కు హాజరైన టీచర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల మేరకు ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలు నిర్వహించాలని ట్రైనర్స్ ఆఫ్ ట్రైనింగ్ కుశలవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి అన్నారు. కేతేపల్లిలో ఎన్నికల అధికారులు (పీవోలు) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ కుశలవరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన, చేయకూడని పనులను వివరించారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్‌బూత్‌లో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎన్నికల విధులకు డుమ్మా కొట్టేవారిపై కఠినచర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఓటర్లకు బ్యాలెట్ పత్రాలు ఇవ్వడం, ఓటేసిన తర్వాత వాటిని బ్యాలెట్ బాక్సుల్లో వేయించాల్సిన విధానాన్ని ఆయన పీవోలకు తెలిపారు. అలాగే రిలీవర్లు ఎలా వ్యవహరించాలనేది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో ఎ.రాజేంద్రప్రసాద్, 120మంది పీవోలు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో 11వ తేదీన జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. శాలిగౌరారంలో నిర్వహించిన పీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మండుల సైదులు, టీవోటీలు ఎస్.గోపి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: పంచాయతీ ఎన్నికల్లో మండలవ్యాప్తంగా విధులు నిర్వర్తించే స్టేజీ-2 రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ విధుల సిబ్బందికి శనివారం నార్కట్‌పల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ విధానం తదుపరి లెక్కింపుపై తగు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కత్తురోజు ఉమేష్‌చారి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

మునుగోడు: ఎన్నికల ప్రక్రియలో విధులను పారదర్శకంగా నిర్వర్తించి సజావుగా పూర్తిచేయాలని ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మాస్టర్ ట్రైనర్లతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధివిధానాలు, పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన పలు అంశాలపై మార్గదర్శకాలతో దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్ నేలపట్ల, అధికారులు విజయ్‌భాస్కర్, ఎంపీవో సీహెచ్.మధు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని జిల్లా ఎన్నికల సహాయ అధికారి మున్నయ్య సూచించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ఉదావత్ లచ్చిరాం నాయక్, రజనీకాంత్, యాకోబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లి : అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కుశలవరెడ్డి

ఈశ్వరచారి కుటుంబాన్ని ఆదుకోవాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపనకు మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఈశ్వరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెండోట సోములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ బిల్లుకు ఆమోదం తెలిపేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, అదేవిధంగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా విమర్శలతో కాకుండా ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈశ్వరచారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పోరాటాలు చేయాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కావని వారు సూచించారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు సతీవియోగం

అనారోగ్యంతో మహేందర్‌రెడ్డి సతీమణి అరుణ మృతి



అరుణ (ఫైల్ ఫొటో)

శాలిగౌరారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం సింగిల్‌విండో వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చామల మహేందర్‌రెడ్డి సతీమణి అరుణ (60) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమె శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతదేహంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం, కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె అంతిమయాత్రలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధుమిత్రులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సిబ్బందిని సన్మానిస్తున్న ఏపీడీ శ్రావణ్‌కుమార్

తిప్పర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ పీడీ శ్రావణ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీనిధి సంస్థ ద్వారా ఎంతో మంది దివ్యాంగులకు బ్యాంకు లోన్లు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలో అత్యధికంగా నూతనంగా 91 సంఘాలను ఏర్పాటు చేసిన తిప్పర్తి మండల మహిళా సమాఖ్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సోమయ్య, శ్రీనిధి ఆర్ఎం రేఖ, రాణి, సైదులు, జానకమ్మ, రేణుక, ధనమ్మ, ఏపీఎం సంకు హరి, సీసీలు ఎమెలియా, శ్రీనివాస్, జ్యోతి, వసంత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం నకిరేకల్ మండలం తాటికల్, మంగళపల్లి, మర్రూరు, మండలాపురం, మోదినిగూడం గ్రామాలలో కాంగ్రెస్ తరుపున పోటీచేస్తున్న సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకోసం నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ఇండ్లులేని వారికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ తరుపున పోటీలో సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, నకిరేకంటి యేసుపాదం, గాదగోని కొండయ్య, చనగాని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేత

మునుగోడురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన చందపాక లింగస్వామి కుమారుడు హర్షవర్ధన్(10) ఆటో బోల్తాపడి శుక్రవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన పొలగోని సైదులు హర్షవర్ధన్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ హర్షవర్ధన్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

మునుగోడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన పేరుతో ప్రతిపక్షానికి చెందిన తమను ముందస్తు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించటం పూర్తి అప్రజాస్వామికమని పలువురు నేతలు ఖండించారు.

మునుగోడు మండలంలోని పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు శనివారం తెల్లవారుజామునే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, డీవైఎఫ్ఐ వంటి వివిధ సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష నేతలను అదుపులోకి తీసుకొని విడుదల చేసినట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
*** గరిష్ఠం 28.5 కనిష్ఠం 16.0
ANDHRAJYOTHY

నల్లగొండ

ఆదివారం 7 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579 (280.1200)	17,972	17,972
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.80 (4.41)	513.15	513.15
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	2,000	3,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



దేవరకొండ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, జైవీర్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి చేస్తాం

- కేసీఆర్, హరీశ్‌రావు బండకట్టుకొని సాగర్, శ్రీశైలంలో దూకినా పనులు ఆపేది లేదు
- దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి



నల్లగొండ/దేవరకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేసీఆర్, హరీశ్‌రావు బండకట్టుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో దూకినా ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టును తమ హయాంలోనే కట్టితీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శనివారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన ప్రజావిజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలిసి రూ.20కోట్ల వ్యయంతో దేవరకొండ మునిసిపాలిటీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మెప్మా ద్వారా మహిళా సంఘాలకు రూ.11.33కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలూనాయక్ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాల భూమికి సాగునీరిచ్చే ఉద్దేశంతో 2005లో అప్పటి మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీని రూ.2వేల కోట్లతో చేపట్టారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 30 కిలోమీటర్ల సొరంగం తవ్వారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్లగొండపై కక్షగట్టి, సొరంగాన్ని పడావుపడేశారని, 10కిలోమీటర్ల సొరంగాన్ని తవ్వకుండా వదిలేశారని అన్నారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాక తామే ఈ పనులు ప్రారంభించగా, దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి, ఎనిమిది మంది మృతి చెందితే కేసీఆర్, హరీశ్‌రావు డ్యాన్సులు చేశారని ఆరోపించారు. ఎవరు అడ్డుపడ్డా, ఎన్ని కుట్రలు చేసినా ఈ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, వీటితో పాటు...

- మిగతా 7వ పేజీలో...

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తిచేసి సాగునీరు అందిస్తాం



రెండేళ్లలో శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దేవరకొండ మండలం ముదిగొండ మా అమ్మమ్మ ఊరని, ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించి రుణం తీర్చుకుంటానన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి 14వేల రేషన్‌కార్డులు అందించి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కొడంగల్ మాదిరిగానే దేవరకొండ అభివృద్ధి



దేవరకొండ నియోజకవర్గాన్ని కొడంగల్ నియోజకవర్గం మాదిరిగానే నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. దేవరకొండ నియోజకవర్గంలో సమస్యలు గుట్టలలాగా ఉన్నాయి. గత ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీశైలం సొరంగమార్గాన్ని కుర్చీ వేసుకొని కూర్చొని తొవ్విస్తానని హామీ ఇచ్చి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారు.

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి



దేవరకొండ నియోజకవర్గంలో ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కెటాయించి పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంపై దృష్టిసారించి ప్రధాన సమస్యలను పరిష్కరించాలి. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కెటాయించాలి.

నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే, దేవరకొండ

రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తి



నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్‌లో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పలువురు సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాల్లో 282గ్రామ పంచాయతీలకు, 2,418 వార్డు స్థానాలకు ఈ నెల 14న రెండోవిడత ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఈ నెల 2వ తేదీతో నామినేషన్ల దాఖలు పూర్తయింది. సర్పంచ్ స్థానాలకు 2,116 నామినేషన్లు, వార్డులకు 6,120 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే ఎంత మంది నా మినేషన్లు ఉపసంహరించుకున్నారు, ఎన్ని స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది, బరి లో నిలిచిన అభ్యర్థులు, ఏకగ్రీవ పంచాయతీల వివరాలపై ఆదివారం ఉదయానికి స్పష్టత రానుంది. పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు కావడంతో లెక్కలు తేల్చడంలో అధికారులు తలమునకలయ్యారు. రెండో విడత పోలింగ్ ఈనెల 14న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు.

మూడో విడతకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజు అభ్యర్థులను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు. మూడో విడత పోలింగ్‌ను ఈ నెల 17న నిర్వహించనున్నారు. తొలి విడత పోలింగ్ ఈనె ల 11న తేదీన నల్లగొండ, చండూరు డివిజన్లలో జరగనుంది.

సర్పంచ్ స్థానాలకు 1,962 నామినేషన్లు వార్డులకు 5,606

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): దేవరకొండ డివిజన్‌లో మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు తొమ్మిది మండలాల్లోని 269 గ్రామ పంచాయతీల్లో 1,962 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 2,206 వార్డు ఉండగా, 5,606 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆరు వార్డులకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని అధికారులు పేర్కొన్నారు.

మూడో విడత నామినేషన్లు ఇలా..

మండలం	పంచాయతీలు	సర్పంచ్ నామినేషన్లు	వార్డు స్థానాలు	నామినేషన్లు
చందంపేట	30	227	250	622
చింతపల్లి	36	207	294	798
దేవరకొండ	41	318	316	837
గుడిపల్లి	12	103	104	269
డిండి	39	271	326	840
గుర్రంపోడు	38	278	314	770
కొండమల్లేపల్లి	27	190	216	526
నేరేడుగొమ్ము	21	178	170	437
పీఏపల్లి	25	190	216	507
మొత్తం	269	1,962	2,206	5,606

క్రీస్తు బోధనలను ఆచరించాలి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలను ఆచరించి జీవితాలను సుఖమయం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం క్లాక్‌టవర్ సెంటర్‌లోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో రోమన్ క్యాథలిక్ బిషప్ కె.థమస్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యునైటెడ్ క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి మాట్లాడుతూ, ఏసు క్రీస్తు ప్రేమ, దయ, క్షమ, మానవత్వంతో జీవించడాన్ని బోధించారని, ఆ బోధనలు కోట్లాది మంది ప్రజలపై చెరగని ముద్ర వేసిందన్నారు. పట్టణంలోని అన్ని చర్చిల సంఘకాపరులు, కమిటీలు కలిసి ఐక్యంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం జెన్నీ క్రిస్టఫర్ ఏసు సందేశాన్ని ప్రవచించారు.

క్వాయర్స్ పాడిన భక్తి గీతాలు అలరించాయి. అనంతరం సామూహికంగా కొవ్వొత్తులు వెలిగించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని బైబిల్ బోధనలను ఆలకించి పరవశించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, చర్చి ప్రెసిడెంట్ టీఎస్.క్రిస్టఫర్, ప్రవీణ్‌కుమార్, జీవన్, జోసఫ్, పసల శౌరయ్య, మోజెస్, రేఖల భద్రాద్రి, ఏలేషా, శామ్యూల్, వినయ్‌కుమార్, అంబిక, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు



నల్లగొండ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన నేతలు

నల్లగొండ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు బీఆర్ఎస్, బీజేపీ నాయకులను, కార్యకర్తలతో పాటు విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని చండూరు వద్ద అరెస్టు చేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు పిల్లి రామరాజును అరెస్టు చేశారు. ఎంజీయూలో బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్, బీజేపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మర్రిగూడ బైపాస్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ శంకర్, ఏర్పుల రవి, ఖయ్యుంబేగ్, కత్తుల సహదేవ్ పూలమాలలు వేశారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ తదితరులు నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బకరం శ్రీనివాస్ మాదిగ, బొజ్జ దేవయ్య తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

నాయకులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ పెంచేందుకు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, అందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థులకు సహకరించని నాయకులు, కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు నూక కిరణ్ కుమార్ యాదవ్, గుజిలాల్ శేఖర్‌బాబు, తాళ్లూరి మురళి, చాడ సురేష్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, దండ అశోక్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, నోముల జనార్ధన్, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తాం

రిజర్వాయర్ ముంపు గ్రామాల ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు కేశవులు



పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న నిర్వాసితులు

మర్రిగూడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్, పునరావాసం కల్పించకపోతే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని చర్లగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామాల ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు వల్లపుదాస్ కేశవులు అన్నారు. శనివారం మర్రిగూడలో విలేకరులతో మాట్లాడుతూ, డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్‌తో నాలుగు గ్రామాలు నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి, వెంకపల్లితండా పూర్తిగా ముంపునకు గురవుతున్నాయన్నారు. నిర్వాసితులకు పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 17 ఏళ్లు గడుస్తున్నా ఆ హామీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గ్రామాల్లో 1,255మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. నిర్వాసితులు పలుమార్లు ఉద్యమాలు, ధర్నాలు, నిరసనలతో పనుల నిలిపివేసినప్పుడల్లా ఉన్నతాధికారులు రావడం, హామీ ఇవ్వడంతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేదంటే పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటామనే నెపంతో నిర్వాసితులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. జిల్లాలో ఎక్కడ బహిరంగ సభ నిర్వహించినా నిర్వాసితులను అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. పోలీసులు రాత్రికి రాత్రి వచ్చి ప్రభుత్వ ఉద్యోగులని కూడా చూడకుండా, పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను సైతం అరెస్ట్ చేసి బలవంతంగా వాహనాల్లో తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, కేసులు పెట్టినా తమ పోరాటం ఆగదన్నారు. సమావేశంలో ఎరుకల యాదయ్య, భీమనపల్లి వెంకన్న, వెంకటయ్య, నరసింహ, రాములు, అంజయ్య, జంగాలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లు ముట్టడిస్తాం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీసీ సంఘం నేతలు

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లను ముట్టడిస్తామని, బీసీ ప్రజాప్రతినిధులు పదవులకు వెంటనే రాజీనామా చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌ల చట్టాన్ని పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్లను ఇస్తామని మాటతప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, బీసీలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరే సాయి ఈశ్వరచారి ఆత్మహత్యకు కారణమన్నారు. ధర్నాలో బీసీ నాయకులు కాసోజు విశ్వనాథం, నల్లసోమ మల్లన్న, జెల్లా ఆదినారాయణ, కోల్లోజు సత్యనారాయణ, కేశబోయిన శంకర్, వాడపల్లి సాయిబాబా, రాచకొండ గిరి, సీతారాములు, హరిప్రసాద్, చలమయ్య, చంద్రశేఖర్, విష్ణుమూర్తి, సత్యనారాయణ, రమణాచారి, వెంకటాచారి, కిషన్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరచారిది ప్రభుత్వ హత్యే

(ఆంధ్రజ్యోతి, రామగిరి): బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసినందుకే ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యగానే భావించాల్సి వస్తుందని స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి అన్నారు. సాయి ఈశ్వరచారి మరణంపై సంతాపంగా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యకర్తలు శనివారం పట్టణంలోని సిమెంట్ రోడ్డు నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం వల్లే ఈశ్వరచారి ఆత్మ బలిదానం చేసుకున్నాడన్నారు. అతడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పిల్లల చదువులకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లోజు సత్యనారాయణచారి, కాసోజు విశ్వనాథం, చోల్లేటి హరిప్రసాద్, తాడూరి చల్మయ్య, గొట్టిముక్కల చంద్రశేఖర్, కూరెళ్ల మదనాచారి, పాల్గొన్నారు.

హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

చండూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్, పంచాయతీ ఎన్నికల్లో గెలవాలని బహిరంగ సభల పేరుతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కుట్ర పన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం మర్రిగూడ మండలం శివన్నగూడలో చెల్లి ఇంట్లో శుభకార్యానికి వెళ్తుండగా చండూరు పట్టణ శివారులో ఆయన్ను నల్లగొండ పోలీసులు అడ్డుకున్నారు. దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ నేపథ్యంలో భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు ఇంటికి వెళ్లగా, ఆయన అప్పటికే బయల్దేరడంతో విషయం తెలుసుకున్న నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ ఎస్సై సైదులు భూపాల్‌రెడ్డి వాహనాన్ని వెంబడించి రెండు గంటలకుపైగా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు అప్పటికే అక్కడికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెల్లి ఇంట్లో శుభకార్యానికి వెళ్తుంటే అడ్డుకోవడమేటని భూపాల్‌రెడ్డి పోలీసులను నిలదీశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17శాతానికే పరిమితం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ద్రోహానికి బీసీ బిడ్డ బలయ్యాడన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థి మామిడి నాగలక్ష్మి, ఆమె భర్త యాదగిరిపై దాడులు చేసిన వ్యక్తులపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఘటనకు కారకుడైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్, నాయకులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, వెంకట్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, వెంకన్న, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనులు, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రానికి రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే పార్టీ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొంటారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చా జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలి



సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపీపీ భవానీపవన్‌కుమార్(పక్కన ఎమ్మెల్యే బాలునాయక్)

చింతపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా దేవరకొండలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో శనివారం మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ వినతి పత్రం అందించారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ప్రజలకు మౌళిక వసతి సౌకర్యాల కల్పన కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండు జిల్లాల కూడలి ప్రముఖ విద్యా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన వెంకటేశ్వరనగర్(మాల్)లో ప్రభుత్వ కళాశాలతో పాటు డ్రైనిజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచి అంగిరేకుల గోవర్ధన్, మాన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో పలువురు నేతల అరెస్టులు



దేవరకొండలో ముందస్తు అరెస్టయిన బీసీ సంఘం నేతలు

దేవరకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ముఖ్యమంత్రి బహిరంగసభ ఉండడంతో ముందస్తుగా పలు పార్టీల నేతలను శనివారం ఉదయం దేవరకొండ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి దేవరకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీసీ రిజర్వేషన్లు చట్టభద్రత కల్పించాలని, ప్రాజెక్టులు పూర్తి చేయాలని బీసీ సంఘం నేతలతోపాటు బీజేపీ నేతలు డిమాండ్ చేయడంతో ముందస్తుగా వారిని అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీపై విడిచిపెట్టారు. అరెస్టయినవారిలో బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు సీపీఎం, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుర్రంపోడు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ పర్యటన నేపథ్యంలో



గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ఆశా కార్యకర్తలు

గుర్రంపోడు మండలంలో శనివారం ఉదయం బీఆర్ఎస్ నాయకులను, ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అరెస్టయివారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, సైదిరెడ్డి, కృష్ణగౌడ్, మహేందర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఏకగ్రీవం దిశగా..

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా తిరుమలగిరి(సాగర్) మండలంలో 8 గ్రామపంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ కావడంతో ఈ ఎనిమిది గ్రామాల్లో ఒకరే సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో తునికినూతల, తిమ్మాయిపాలెం, నాయకునితండా, గోడుమడక, కీచ్యాతండా, గరికెనెట్‌తండా, జాల్‌తండా, సపావత్‌తండా గ్రామాలకు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లు వెల్లడించారు. తునికినూతల గ్రామానికి జటావత్ బోడ్కా, తిమ్మాయిపాలెం- జటావత్ తులసీ, సపావత్‌తండా- జటావత్ బిక్కు, కీచ్యాతండా- వాంకుడోతు లలిత, నాయకునితండా- మెరావత్ పూలా, గరికెనెట్‌తండా - సపావత్ బాలు, జాల్‌తండా- జటావత్ బామిని, గోడుమడక- నేనావత్ పీకలిశ్రీనునాయక్‌లు సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● వేములపల్లి : మండలంలో 12 సర్పంచ్ స్థానాలకు గాను 42 మంది అభ్యర్థులు బరిలో నిలవగా 116వార్డులకుగాను 298 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాగా రావులపెంట 3వ వార్డుకు ఉత్తెర్ల సురేష్, అన్నపరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిదిలోని 4వ వార్డుకు తిక్కనబోయిన లింగయ్య ఒక్కరే బరిలో ఉండంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది.

● మిర్యాలగూడ రూరల్: మండలంలోని 46 గ్రామపంచాయతీల్లో రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని జప్తివీరప్పగూడెం క్లస్టర్ కేంద్ర పరిధిలో గల అన్నారం గ్రామ సర్పంచ్‌గా స్వతంత్ర్య అభ్యర్థిని సారెడ్డి అరుణశ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుంటకిందితండా గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రూపావత్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

'రైతు పోరాటాలను తీవ్రతరం చేయాలి'

నకిరేకల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన విద్యుత్, విత్తనాల బిల్లులను వ్యతిరేకించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్ర ధాన కార్యదర్శి అంబటి చిరంజీవి పిలుపునిచ్చారు. మండలంలోని నోముల గ్రామంలో నిర్వహించిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు పోరాటాలను తీవ్రతరం చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు గజ్జి రవి, రావుల లింగయ్య, బొమ్మిడి నగేష్, కుంచెం వెంకన్న, అంబటి నర్సయ్య, పజ్జూరు ఉపేంద్ర, వెంకన్న, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అణగారిన వర్గాల హక్కుల పతాక

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అణగారిన వర్గాల హక్కుల పతాకమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అం బేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ రచన ద్వారా అంబేడ్కర్ దేశ ప్రజలకు గణనీయమైన సేవలు అందించారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించారని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టార్ క్యాంపెయిన్ చైర్మన్ పోలగాని వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

ప్రజాస్వామిక హక్కుల కోసం రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఐకమత్యం గా ఉద్యమించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు బెల్లంకొం డ హరికృష్ణ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. స్వతంత్ర్య భారతంలో రాజ్యాంగ హక్కుల అమలు కోసం కొట్లాడుతూ వస్తున్న ప్రజలు ఈ దశాబ్దంలో రాజ్యాంగ రక్షణ కోసం ఉద్యమించాల్సి రావడం విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుం జ య, వైస్ ప్రిన్సిపాల్ మధు, బాలకృష్ణ, నాయకులు యాదయ్య, దుర్గయ్య, రాజారాం, ప్రభాకర్, రాంరెడ్డి, రమేష్, సతీష్, జ్యోతి, సైదమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్: అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని టీడీపీ జా తీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిలకల వెంకన్న, నాయకులు కాశయ్య, చావ వెంకటేశ్వర్లు, అనంతరాములు, సత్యనారాయణ, లింగానాయక్, కాంతాచారి పాల్గొన్నారు.

● ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దై ద బాల, డి.భాగ్యరాజు, పాతకోటి రమేష్, దాసరి వెంకటరత్నం, కడియం రమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, అనిత, విజయవాణి, మమత, జ్యోతి పాల్గొన్నారు.

● షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మాడ్గుల శ్రీనివాస్ అధ్యక్షతన అంబేడ్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్ట ర్ రాజు, తాళ్లపల్లి రవి, ముండ్లగిరి కాంతయ్య, మల్లేష్, ధనమ్మ, లలిత, జాన య్య, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా యాచకులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్, జేఏసీ కన్వీనర్లు చేగొండి మురళీయాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దవూర: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పెద్దవూర జాతీయ నాయకుల విగ్రహాల నిర్మాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృ షి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొనిగా మోహన్‌రావు, రామకృ ష్ణ, విద్యాసాగర్, కోటయ్య, చిన్న జానయ్య, సురేందర్, సురేష్ పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని తక్కళ్లపల్లిలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేతరి శోభారాణి, ఏసు, దళితులు పాల్గొన్నారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి వాసులు, తక్కెళ్లపల్లి సైదులు, శ్రీను, నకిరేకంటి సైదులుమాదిగ, గార్లపాటి గోవర్ధన్, శివ, కోటేష్, వంశీ, చిన సైదులు, బిక్షమయ్య, రాము, కార్తీక్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో... అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో అం బేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ముడావత్ లక్ష్మణ్‌నాయక్, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందా సైదులురావుగౌతమ్, నాయకులు సూర్యానాయక్, రమావత్ రాముడు, వెంకటేష్, వాలియా, లాలు, జాంపా, బద్యా, రాముడు పాల్గొన్నారు.

వేములపల్లి: వేములపల్లి మండలకేంద్రంలో అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు పుట్టల మధు నివాళులర్పించారు. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్, ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు ని ర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దీన సుజాత, అంబేడ్కర్ యూత్ కమిటీ స భ్యులు వంటెపాక వంశీ, గుడిగుంట కిరణ్, రమణపల్లి సంజయ్, దైద సంజయ్, మాతంగి రేగన్ పాల్గొన్నారు.



మిర్యాలగూడలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు



మిర్యాలగూడలోని క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



మిర్యాలగూడ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



హాలియా మునిసిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

నిడమనూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14వ తేదీన జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ శనివారం ముగిసింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు 237 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం 162 నామినేషన్లు ఆమోదించారు. కాగా 79 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. అనంతరం 83 మంది పంచాయతీ బరిలో తలపడుతున్నారు. నిడమనూరు మేజర్ గ్రామ పంచాయతీలో ఆరుగురు అభ్యర్థులు రంగంలో ఉండగా, గుంటిపల్లిలో ఐదుగురు, శాఖాపురం, ఎర్రబెల్లి, పార్వతీపురం, నారమ్మగూడెం, రాజన్నగూడెం, ఇండ్లకోటయ్యగూడెం గ్రామాల్లో నలుగురు చొప్పున, వేంపాడ్, బంకాపురం, వెనిగండ్ల, ఊట్కూరు, మార్లగడ్డక్యాంపు గ్రామాల్లో ముగ్గురు చొప్పున అభ్యర్థులు బరిలో ఉండగా, మిగిలిన గ్రామాల్లో ఇద్దరు అభ్యర్థుల చొప్పున రంగంలో ఉన్నారు. పలు గ్రామాలను ఏకగ్రీవం చేసేందుకు ఎత్తుగడలు వేసినప్పటికీ కనీసం ఒక్క గ్రామం కూడా ఏకగ్రీవం కాలేదు. దీంతో మొత్తం 29 గ్రామాల్లో పోటీ అనివార్యమైంది. ఇండ్లకోటయ్యగూడెం, మార్లగడ్డక్యాంపు, ముప్పారం, గుంటుకగూడెం గ్రామాల్లో కొన్ని వార్డులు ఏకగ్రీవమయ్యాయి. పలు గ్రామాల్లో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అనే విధంగా పోటీ ఉంది. ప్రచారానికి ఆరు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో ముమ్మరం చేశారు.

● నేరేడుగొమ్ము : మండలంలో 21 గ్రామ పంచాయతీ స్థానాలకు 178 సర్పంచ్‌లు, 170 వార్డులకు గాను 437 వార్డులకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. శనివారం నామినేషన్లు పరిశీలించగా ఏలాంటివి తిరస్కరించబడలేదని అధికారులు తెలిపారు.

ముగిసిన మూడో విడత నామినేషన్లు

పెద్దఅడిశర్లపల్లి, : ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో మూడో విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు అభ్యర్థులు భారీగా తరలిరావడంతో రాత్రి వరకు ప్రక్రియ కొనసాగింది. పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో 25 గ్రామ పంచాయతీలకు గురువారం వరకు 130 సర్పంచ్, వార్డులకు 195 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి, రెండు రోజులతో పోల్చితే చివరి రోజు శుక్రవారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకు సమయం కేటాయించగా, చివరి రోజు సమయం సరిపోలేదు. ఎన్నికల సిబ్బంది సాయంత్రం 5 గంటలలోపు కేంద్రాలకు వచ్చిన వారికి టోకెన్లు జారీ చేశారు. చివరి రోజు 19 0 సర్పంచ్‌లకు, 507 వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే గుడిపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలకు 103 సర్పంచ్, 269 వార్డులకు నామినేషన్లు దాఖలుయ్యాయి. శనివారం నామినేషన్లు పరిశీలించగా ఏలాంటివి తిరస్కరించబడలేదు. రాంపురం గ్రామ పంచాయతీలో 1, 2, 6 వార్డులలో బీసీలు, ఓసీలు ఉన్నారు. కానీ 1 వార్డు, 6వ వార్డు ఎస్టీకి రిజర్వ్ కావడంతో 2వ వార్డు జనరల్ వచ్చింది. దీంతో గ్రామస్థులు బీసీలకు రిజర్వేషన్లు కేటాయించలేదని ఆక్రోశంతో ఎస్‌టి అభ్యర్థులకు జమానత్ ఇవ్వకపోవడంతో 1,2,6 వార్డులకు ఒక్క నామినేషన్ కూడా పడలేదు. ఇదే విషయమై ఎంపీడీవో చంద్రమౌళిని వివరణ కోరగా సా యంత్రం వరకు వేచి చూసిన ఆ మూడు వార్డులకు ఒక్క నామినేషన్ కూడా రాకపోవడంతో ఆ విషయాన్ని పై అధికారులకు తెలిపారని అన్నారు.

●డిండి : మండలంలోని 39 గ్రామపంచాయతీలకు 271 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేయగా 326 వార్డులకు 840 మంది నామినేషన్‌లు వేశారు. గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు బహుముఖ పోటీ ఉంది. నామినేషన్ వేసినవారిని పోటీ నుంచి విరమింపజేసేందుకు బుజ్జగింపుల పర్వం కొనసాగుతుంది. ఈనెల 9న ఉపసంహరణలు ముగియనున్నాయి.

● చింతపల్లి : మండలంలో మొత్తం 36 గ్రామపంచాయతీల్లో 294 వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగించారు. 207.మంది సర్పంచు అభ్యర్థులు, వార్డులకు 798 మంది అభ్యర్థులు నామినేషన్లు దాలాలు చేసినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు.

రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరవీరుల పార్కులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మరోమారు మోసం చేసిన నేపథ్యంలో బీసీలంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో నిలబడిన బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించాలని కోరారు. దశాబ్దాల కాలంగా దగాకు గురవుతున్న వెనుకబడిన తరగతులు స్వీయ చైతన్యం తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 15, 16వ తేదీల్లో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, బంటు కవిత, ఉమా, శ్రీలత, విజయలక్ష్మి, దోనేటి శేఖర్, ఎస్సీనాయుడు, తాళ్లపల్లి విజయ్, నాగయ్య, శ్రీనివాస్, ప్రభంజన్ పాల్గొన్నారు.

తిమ్మాపురం పంచాయతీ ఏకగ్రీవం

దామరచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చెందిన రూపావత్ హతీరాంను గ్రామస్థులు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాయి ఈశ్వర్‌కు ఘన నివాళి



నిడమనూరులో సాయి ఈశ్వర్‌కు నివాళులర్పిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

నిడమనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోవడంతో మనోవేదనకు గురై ప్రాణాలర్పించిన అనుముల ఈశ్వరాచారికి మండల కేంద్రంలో శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్వర్ణకారులు తమ దుకాణాలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈశ్వరాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీ ఉద్యమంలో విశ్వబ్రాహ్మణులు మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాధుల రమేష్‌చారి, మాజీ ఎంపీటీసీ రాణి, అనుముల నర్సింహచారి, కొండోజు కృష్ణ, కాసోజు కృష్ణ, కాలె వసంతరావు, ముజ్జా అనిల్, వెంకటాచారి, జ్ఞానేశ్వర్, మదనాచారి, శ్రీపాద రమణ, నాగాచారి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

దేవరకొండలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభ విజయవంతమైంది. సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్థానిక నాయకులు రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



దేవరకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు హాజరైన ప్రజలు



సభలో సీఎంను ఫొటో తీసున్న గిరిజన మహిళ



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలునాయక్ కుటుంబ సభ్యులు



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, స్థానికనాయకులు